కళావిహీనంగా పార్కులు


పిచ్చి మొక్కలతో ఉన్న కాటన్ పార్కు


కాటన్ పార్కులో పేరుకుపోయిన తుప్పలు

- కాటన్ బ్యారేజ్ వద్ద పార్కులు అధ్వానం
- నిర్వహణ లేక పెరిగిన పిచ్చి మొక్కలు
- ఇబ్బందులు పడుతున్న వాకర్స్
- పట్టించుకోని అధికారులు

ధవళేశ్వరం: ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద ఉన్న పార్కులు కనీస నిర్వహణ లేకపోవడంతో పిచ్చి మొక్కలు పెరిగి కళావిహీనంగా మారాయి. నిర్వహణ లేకపోవడంతో పిచ్చి మొక్కలు, పొదలు పెరిగి చిట్టడవిని తలపిస్తున్నాయి. ప్రతి రోజూ వందలాది మంది సందర్శకులు, వాకర్స్ ఈ పార్కుల వద్దకు వస్తుంటారు. అయినప్పటికీ పార్కు నిర్వహణపై అధికార యంత్రాంగం దృష్టి సారించకపోవడంతో కాటన్ పార్కులు అధ్వానంగా మారాయి. కాటన్ పార్కు చేర్చి ఉన్న మరో పార్కులో ప్రస్తుతం వాకర్స్ వాకింగ్ చేస్తున్నారు. ఒక్కోసారి వారే పార్కును శుభ్రం చేసుకొని వాడుకుంటున్నారు. కాటన్ పార్కులో పిచ్చి మొక్కలు, పొదలు పెరిగిపోవడంతో పాములు సైతం సంచరిస్తున్నాయని వాకర్స్ భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదకరంగా..

ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయం ఎదురుగా ఉన్న పార్కులో సైతం నిర్వహణ లేక పిచ్చి మొక్కలతో ప్రమాదకరంగా మారింది. గోదావరి అందాలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు ఈ పార్కులలో సేద తీరేవారు. స్థానికులతో పాటు పర్యాటకులు కాటన్ బ్యారేజ్ అందాలను చూసేందుకు ఈ పార్కులకు వచ్చేవారు. ఈ పార్కుల నుంచి చూస్తే బ్యారేజ్ నుంచి మిగులు జలాలు విడుదల చేసే సమయంలో గోదావరి అందాలు అద్భుతంగా కనిపిస్తాయి. ఎక్కువ మంది పర్యాటకులు కార్తిక మాసం సమయంలో ఈ పార్కులకు వస్తారు. నిర్వహణ లేక పార్కులు చిట్టడవిలాగా మారడంతో పర్యాటకులు పార్కుల బయట నుంచే వెళ్లిపోతున్నారు. కాటన్ పార్కులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పూర్వ వైభవం తీసుకురావాలని సందర్శకులు, వాకర్స్ కోరుతున్నారు.

నిర్వహణపై దృష్టి

కాటన్ పార్కు నిర్వహణపై ఇరిగేషన్ అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. నిర్వహణకు నిధులు కేటాయించి ఉదయం వాకర్స్‌కు ,అనంతరం సందర్శకులకు కాటన్ పార్కులను అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు. వెంటనే పార్కులో పేరుకుపోయిన పిచ్చి మొక్కలు తొలగించాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

మల్లేశ్వరునికి లక్ష బిల్వార్చన, శాంతి కల్యాణం


స్వామి శాంతి కల్యాణం చేస్తున్న అర్చకులు

కడియం: స్థానిక మల్లేశ్వర స్వామి వారికి శనివారం లక్ష బిల్వార్చన, శాంతికల్యాణం నిర్వహించారు. ఆలయ అర్చకులు అప్పలి శ్రీమన్నారాయణ, మల్లేశ్వరరావుల ఆధ్వర్యంలో వేదోక్తంగా బిల్వార్చన చేశారు. ఉదయం నుంచీ ప్రత్యేక పూజల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, శాంతికల్యాణం, ప్రసాద వితరణ చేశారు.

1న పోలమాంబ కుంచమాంబ జాతర

సీటీఆర్ఐ: వచ్చే నెల ఒకటో తేదీ నుంచి వడ్డి పోలమాంబ కుంచమాంబ 108వ రెల్లికుల జాతర మహోత్సవాలు నిర్వహించనున్నట్టు జాతర కమిటీ అధ్యక్షుడు అల్లం పోలయ్య తెలిపారు. ఈ మహోత్సవాలు డిసెంబర్ ఒకటో తేదీ నుంచి జనవరి ఏడో తేదీ వరకు జరుగుతాయని వివరించారు. వచ్చే నెల ఒకటిన గంగాలమ్మ జాతర, 2న దారుల కట్టుట, నీళ్ల బావుట, 10న ఆకాశ దీపాలు ఉత్సవం జరుగుతుందన్నారు. డిసెంబర్ 14న సత్తెమ్మ తల్లి పిడతల ఉత్సవాలు, 15 సాయంత్రం 3 గంటలకు మరిడమ్మ తల్లి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. 16న అమ్మవార్లకు రంగులు వేసేందుకు తీసుకువెళ్లడం, 18 సాయంత్రం పూల ఘట్టం, 19వ తేదీ చల్ల ఘట్టం, 23న రంగులు వేసిన అమ్మవార్లను ఆలయంలోకి తీసుకొస్తామని తెలిపారు. జనవరి 1వ తేదీన దుర్గాలమ్మ బావుట, 6న బాణసంచా కాల్పులు, తొలి ఏళ్ల రాత్రి, అమ్మవార్ల ఊయల సేవ నిర్వహిస్తామని అన్నారు. 7న ముగింపు సందర్భంగా అమ్మవార్ల అనువు జరుగుతుందన్నారు. ఎన్నో ఏళ్లుగా తమ పూర్వీకుల నుంచి వడ్డి పోలమాంబ కుంచమాంబ రెల్లికుల జాతర మహోత్సవాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ జాతరకు ఆంధ్రా, తెలంగాణా రాష్ట్రాల నుంచి సుమారు లక్షకు పైగా భక్తులు హాజరై అమ్మవార్లను దర్శించుకుంటారని అంచనా వేస్తున్నట్టు జాతర ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం జాతర పోస్టర్‌ను విష్కరించారు. ఈ కార్యక్రమంలో రెల్లికుల సంఘ పెద్దలు పాల్గొన్నారు.

కూటమి పాలనలో అత్యాచారాలు, అఘాయిత్యాలు

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో జరుగుతున్న అత్యాచారాలు, అఘాయిత్యాలను కూటమి ప్రభుత్వం అరికట్టకపోతే మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు మోతా శారద ధ్వజమెత్తారు. శనివారం నగరంలో ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ గంజాయి, మద్యం వినియోగం అధికమై నేరాలు జరుగుతున్నాయని, మహిళలు, యువతులు, చిన్నారులపై జరుగుతున్న నేరాల నిరోధించాలన్నారు. ప్రభుత్వం వీటిపై వెంటనే చర్యలు తీసుకోకపోతే ఆందోళన తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల అధ్యక్షురాలు కె.పార్వతి, పెద్దిరెడ్డి పద్మావతి నాయుడు, కె.లీలావతి, కె.సీత, కె.శుభలక్ష్మి పాల్గొన్నారు.

రేపు ఉప్పలూరి సుబ్బారావు శతజయంతి

ప్రకాశం నగర్: ఎఫ్ఐటీయూ ఆధ్వర్యంలో తెలుగు జాతీయ మహాసభల వ్యవస్థాపకులు ఉప్పలూరి సుబ్బారావు శత జయంతి ఉత్సవాలు సోమవారం ఐఎల్‌టీడీ సెంటర్ వద్ద గల గేదేల నూకరాజు కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్టు సంఘం ప్రధాన కార్యదర్శి మూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభకు ఎఫ్ఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాజు ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు.

సినిమాలు



శ్యామల	:	మెకానిక్ రాకీ
సూర్యమినీ	:	క
సూర్యప్యాలెస్	:	మెకానిక్ రాకీ
శివజ్యోతి	:	జీబ్రా
అనుశ్రీ	:	దేవకి నందన వాసుదేవ
స్వామి	:	అమరన్
అశోక	:	లక్కీ భాస్కర్
రాజా	:	క
రంభ	:	మందిర
ఊర్వశి	:	కంగువా
మేనక	:	కేశవ చంద్ర రమావత్
కుమారి	:	జీబ్రా
అప్సర	:	మట్కా, లక్కీ భాస్కర్
నామవరం		
వీఎస్ మహల్	:	మెకానిక్ రాకీ
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	జీబ్రా
కడియం		
వెంకటసూర్య	:	మెకానిక్ రాకీ

108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కంబాలచెరువు: 108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే ఆ ఉద్యోగుల సమ్మెకు మద్దతునిస్తామని రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాలు, ట్రేడ్ యూనియన్ నాయకులు, రాజకీయ పార్టీలు డిమాండ్ చేశాయి. జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు సుందర్‌బాబు అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో జిల్లా 108 ఉద్యోగుల సంఘ ప్రధాన కార్యదర్శి గుజ్జుల రమేష్‌బాబు 108 సమస్యలను తెలిపి పలు డిమాండ్లు తెలియజేశారు.108 వ్యవస్థను నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, 8 గంటల పని విధానం అమలు చేయాలని, చనిపోయిన ఉద్యోగులకు ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని సమావేశంలో హాజరైన ట్రేడ్ యూనియన్, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీ ప్రతినిధులుకు వివరించారు. ప్రతినిధులు 108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు లేనిపక్షంలో 108 ఉద్యోగులు చేయబోయే సమ్మెకు సంపూర్ణ మద్దతుని ప్రకటిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీసీసీ ప్రెసిడెంట్, ఐఎన్టీయూసీ నాయకులు టీకే విశ్వేశ్వరరెడ్డి, సీపీఐ(ఎం) రాజమండ్రి సిటీ కార్యదర్శి బి.పవన్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.వెంకటలక్ష్మి, డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వి.రాంబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వై.భాస్కర్, 108 ఉద్యోగ ప్రతినిధులు శ్రీమన్నారాయణ, వెంకటేశ్వరరావు, నాగరాజు ఉద్యోగులు పాల్గొన్నారు.

అఖిల పక్షం నాయకులు

ప్రకాశం నగర్ : 108 ఉద్యోగుల సమస్యలు పరిష్కారించాలని అఖిల పక్ష నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పేపర్ మిల్లు వద్ద గల సీఐటీయూ కార్యాలయంలో 108 ఉద్యోగుల సమస్యలు పరిష్కారాలని కోరుతూ ప్రజా సంఘాలు ట్రేడ్‌యూనియన్ నాయకులు రౌండ్ టేబుల్ సమాశం నిర్వహించారు. ఈ సమావేశానికి డీసీసీ అధ్యక్షుడు టీకే విశేశ్వరరెడ్డి, సీపీఐ నగర కార్యదర్శి పవన్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ 108 వ్యవస్థనను నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలని తదితర డిమాండ్‌లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సుందర్‌బాబు అధ్యక్షత వహించగా వెంకటలక్ష్మి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు .


రౌండ్ టేబుల్ సమావేశంలో 108 ఉద్యోగుల సమస్యలపై చర్చిస్తున్న నాయకులు

రాజ్యాంగ హక్కులపై అవగాహనకు చక్కటి వేదిక

జిల్లా స్థాయి కిశోరి వికాస శిక్షణ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయ మూర్తి గంధం సునీత, చిత్రంలో కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహా కిశోర్ తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): యుక్త వయస్సులో ఉన్న బాలికల, మహిళల ఉజ్వల భవిష్యత్తుకు కిశోరి వికాస కార్యక్రమం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని, శిక్షణ కార్యక్రమం ద్వారా రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన కలిగించడంలో ప్రధాన పాత్ర పోషిస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రకాష్ నగర్ ధర్మచర కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన జిల్లా స్థాయి కిశోరి వికాశం జిల్లా స్థాయి శిక్షకుల శిక్షణ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా ఎస్పీ నరసింహాకిశోర్, ఇతర అధికారులు పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత మాట్లాడుతూ రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులతోపాటు బాధ్యతలను కూడా పిల్లలకు తెలియజేయాలన్నారు. అందరికీ సమ న్యాయం అందించేందుకు మండల స్థాయిలో పారా లీగల్ వలంటీర్లు, లీగల్ ఎయిడ్ క్లినిక్‌ల ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. శిక్షణ పొందిన వారు గ్రామాల్లో యువతకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ అనే అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు.

కిశోరి వికాసం పునాది

ఈ సందర్భంగా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ ఆడపిల్లల ఉజ్వలమైన, ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు కిశోరి వికాసం పునః ప్రారంభ కార్యక్రమం పునాది వేస్తుందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో ఆడపిల్లలపై అసభ్యంగా ప్రవర్తించిన ఐదుగురు టీచర్లను కూడా సస్పెండ్ చేశామన్నారు. జిల్లా ఎస్పీ డి.నరసింహాకిశోర్ మాట్లాడుతూ కిశోరి బాలికలు బాల్యం నుంచి యుక్త వయస్సు వరకు సమాజంలో వారి ఎదుగుదలకు ఎవరు నుంచి మోసపోకుండా అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో జిల్లా కలెక్టర్ నేతృత్వంలో మహిళలకు సహాయాన్ని అందించేలా ఇటీవల 'మహిళా రక్షక్' కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. జిల్లా స్త్రీశిశు సంక్షేమ శాఖాధికారిణి కె.విజయలక్ష్మి జిల్లాలో కిశోరి బాలికల ప్రధాన అంశాల వివరాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాష్ బాబు, ఐసీడీఎస్ పీడీ కె.విజయలక్ష్మి, డీఈఓ కె.వాసుదేవరావు, డీఎంహెచ్ ఓ డాక్టర్ కే వెంకటేశ్వరరావు, డీసీహెచ్ఓ డా.ఎన్‌పీ పద్మశ్రీ, ఎస్ఎస్ఏ పీడీ ఎస్.సుభాషిణి, డీఎస్పీ భవ్యకిశోర్, జిల్లా వొకేషనల్ అధికారి సుబ్రహ్మణ్యం, ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ డా.హరిహర, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి సి.రాజ్‌కుమార్, ఐసీడీఎస్ మండల స్థాయి అధికారులు, విద్యార్థులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సేవల్లో 'స్వర్ణాంధ్ర' ఆదర్శనీయం

జిల్లా అదనపు ఎస్పీ మురళీకృష్ణ ప్రశంసలు


కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అదనపు ఎస్పీ మురళీకృష్ణ

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో అనాథులు, వృద్ధులు, నిరాశ్రయుల కోసం స్వర్ణాంధ్ర సేవా సంస్థ విశేష సేవలు అందిస్తోందని జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్)ఎన్‌బీఎం మురళీకృష్ణ ప్రసంసించారు. శనివారం స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత మొబైల్ అన్నదాన సేవా కార్యక్రమంలో మురళీకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మొబైల్ అన్నదాన సేవలు 1500 రోజులుగా నిరంతరం చేస్తున్న స్వర్ణాంధ్ర నిర్వాహకులు రాంబాబు సేవా నిరతిని మురళీకృష్ణ అభినందించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు మురళీ కృష్ణ చేతుల మీదుగా దుప్పట్లు పంపిణీ చేశారు. రెండున్నర దశాబ్దాల నుంచి స్వర్ణాంధ్ర సేవా సంస్థతో తనకు అనుబంధం ఉందని ఎలాంటి ప్రభుత్వ నిధులు లేకుండా నగరంలో స్వచ్ఛంద దాతలు సహకారంతో స్వర్ణాంధ్ర సేవలు నిర్వహించడానికి సహకరిస్తున్న అందరూ అభినందనీయులన్నారు. స్వర్ణాంధ్ర నిర్వాహకులు డాక్టర్ గుబ్బల రాంబాబు మాట్లాడుతూ అన్నార్తుల ఆకలి తీర్చడానికి 2020లో ప్రారంభించిన మొబైల్ అన్నదాన సేవలో నిరంతరంగా కొనసాగడానికి సహకరిస్తున్న దాతలకు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. స్వర్ణాంధ్ర వ్యవస్థాపకులు పడాల రామిరెడ్డి వెల్ల మునసబు కొండలరావు, తేతలి రామచంద్రరెడ్డి, స్వర్ణాంధ్ర మేనేజర్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన


హుకుంపేట గ్రామ సచివాలయంలో పంచాయతీ సిబ్బందితో ఎన్ఎస్ఎస్ యూనిట్ సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం ప్రభుత్వ అటానమస్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆదేశాల మేరకు దత్తత గ్రామమైన హుకుంపేటలో కమ్యూనిటీ హెల్త్ అవేర్నెస్, తూర్పుగోదావరి నేచురల్ గ్రీన్ ఎన్విరాన్మెంటల్ సొసైటీ, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహకారంతో ఐఈసీ కాంపైన్‌లో భాగంగా ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. శనివారం హుకుంపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.సుభాషిణి దేవి విద్యార్థులకు ఆరోగ్య నియమాలను గురించి తెలిపి ఎయిడ్స్ వ్యాధి నియంత్రణపై అవగాహన కల్పించారు. తదుపరి సచివాలయంలోని సిబ్బంది, గ్రామస్తులతో ఏపీఎస్ఏసీ ప్రాజెక్టు ఆఫీసర్ ఎస్.పువనేశ్వరణ్, అశోక్‌బాబు ముఖాముఖీ చర్చలు జరిపి వారి ఆరోగ్య సమస్యలపై ఉన్న అనుమానాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బీవీఎస్ మూర్తి, పంచాయతీ కార్యదర్శి కె.రాజశేఖర్, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ప్రేమకు పాత్రులు కావాలి


శ్రీసత్యసాయి గురుకులంలో మాతృ పూజ చేస్తున్న విద్యార్థులు


ఉత్సవాలలో నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

- శ్రీసత్యసాయి గురుకులం కరస్పాండెంట్ శ్యామసుందర్
- ఘనంగా సత్యసాయిబాబా 99వ జయంతి

రాజమహేంద్రవరం రూరల్: సనాతన సాంప్రదాయంగా వస్తున్న మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ అనే ఆర్యోక్తులను అవగాహన చేసుకుని, తల్లిదండ్రుల ప్రేమకు పాత్రులు కావాలని శ్రీ సత్య సాయి గురుకులం కరస్పాండెంట్ అయోధ్యుల శ్యామసుందర్ కోరారు. శనివారం రాజమహేంద్రవరం శ్రీ సత్యసాయి గురుకులంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారి 99వ జయంతి ఉత్సవాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. చదువుతోపాటు, ఆధ్యాత్మిక విద్యను బాల్యం నుంచి అలవర్చాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని, అందుకే ఈ రోజు మాతృపూజ చేయించామన్నారు. చదువుతో పాటు సంస్కారాన్ని కూడా నేర్పాలని తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను ఆయన కోరారు. బాల్యం నుంచి మానవతా విలువలను అలవర్చుకొని, ఆదర్శ పౌరులుగా ఎదగాలని, దీనికి తల్లిదండ్రులు కూడా తమ సంతానానికి మంచి ప్రోత్సాహాన్ని ఇవ్వాలని గురుకులం ప్రిన్సిపాల్ కె.గుర్రయ్య సూచించారు. సాయంత్రం బాబా నివాస ప్రాంతం నుంచి ఆడిటోరియం వరకు వేదమంత్రాలు, కోలాటం నృత్యాలు వచ్చారు. బాబా జయంతి సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన వివిధ కార్యక్రమాలు ఆద్యాంతం అలరించాయి. ఈ కార్యక్రమంలో పూర్వపు ప్రిన్సిపాల్ పీవీఎస్ సురేష్, ఆల్కాట్ గార్డెన్ మందిర అధ్యక్షుడు దండమూడి గిరిధర్, కార్యదర్శి గంట హనుమంతరావు, ప్రముఖ వైద్యులు గోలి రామారావు, విద్యార్థులు, తల్లిదండ్రులు, సాయి భక్తులు, గురుకులం ఉపాధ్యాయ బృందం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

29న రుద్రాక్షలతో పంచాక్షరి జపం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న దత్తసాయి మహరాజ్ తదితరులు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): గాడాల గ్రామంలో మహాలక్ష్మి సమేత చిన్నవేంకటేశ్వరస్వామి వారి పీఠంలో కొలువుతీరిన చక్రవాహిని భద్రకాళి సమేత వీరేశ్వరస్వామి వారికి ఈ నెల 29వ తేదీ తెల్లవారుజామున 4.30 గంటల నుంచి రుద్రాక్షాలతో పంచాక్షరి మంత్రం జరుగుతుందని తెలంగాణాలోని మంచిర్యాల అవధూత దత్త సాయి మహారాజ్ అన్నారు. శనివారం ఆయన పీఠాన్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి, పోస్టర్‌ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. పీఠాధిపతి చిన వెంకన్నబాబు స్వామీజీ మాట్లాడుతూ ఈ కార్తిక మాసం పరమ శివునికి ప్రీతికరమైన రుద్రాక్షలో అర్చన చేస్తే అనుకున్న కోరికలు నెరవేరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉభయరాష్ట్రాల చైర్మన్ మతాల రమేష్, పీఠం నిత్య సేవకుడు దత్త నృసింహ రాజు, మనగుడి-మనసేవ భారతీత ఆధ్యాత్మిక సేవా సమితి జాతీయ చైర్‌పర్సన్ ధరణికోట దుర్గా వేంకట హేమవతి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటరు నమోదుకు 66 దరఖాస్తులు


బొమ్మూరులో శిబిరాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ జయసూర్యకుమార్

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో శనివారం నిర్వహించిన 267 పోలింగ్ బూత్‌లలో నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలలో 66 దరఖాస్తులు స్వీకరించినట్టు నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ ఎస్.సరళవందనం తెలిపారు. ఈ శిబిరాలలో కొత్త ఓటరు నమోదుతోపాటు, ఓటు తొలగింపులు, ఓటు మార్పుతోపాటు కలెక్షన్లకు దరఖాస్తుల స్వీకరించామన్నారు. ఫారం-6కు 26, ఫారం-7కు 11, ఫారం-8కు 29 దరఖాస్తులు బూత్ స్థాయి అధికారులు స్వీకరించారన్నారు. ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను రూరల్ తహసీల్దార్ పీవీవీ జయసూర్యకుమార్ పరిశీలించారు. ఆదివారం ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు కొనసాగుతాయని, ఈ శిబిరాల్లో 2025 జనవరి ఒకటి నాటికి 18 సంవత్సరాలు నిండే ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవచ్చన్నారు.

అన్యమత ప్రచారంపై ఫిర్యాదు


అన్యమత ప్రచారంపై ధవళేశ్వరం పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న హైందవ ఐక్యవేదిక సభ్యులు

ధవళేశ్వరం: అన్యమత ప్రచారం నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ధవళేశ్వరం హైందవ వేదిక నాయకులు శనివారం ధవళేశ్వరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. హిందువులు పవిత్రంగా భావించే ధవళేశ్వరం రామపాదాలరేవులో హిందువులను రెచ్చగొట్టేలా మత సామరస్యానికి తూట్లు పొడుస్తూ పవిత్ర కార్తిక మాసంలో చట్ట వ్యతిరేకమైన మత మార్పిడి కార్యక్రమం నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. కాటన్ పేటకు చెందిన పాస్టర్, చర్చి బృందం ఈ మత మార్పిడికి పాల్పడుతున్నారని వీరిపై చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో కూడా గ్రామ దేవతను ఇతను దూషించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. హైందవ ఐక్యవేదిక నాయకులు మెండా వెంకట్, ఒంటెద్దు స్వామి, పట్నాల సూరిబాబు, యడ్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బుల్లెట్ సైలెన్సర్ల తొలగింపు

కంబాలచెరువు: జిల్లాలో నిర్ణీత డెసిబుల్స్‌కు మించిన 100 బుల్లెట్ ద్విచక్ర వాహనాల సైలెన్సర్లను జిల్లా ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. నగరం చుట్టు పక్కల పరిసర ప్రాంతాలలో కొంతమంది బుల్లెట్ సైలెన్సర్లు కంపెనీ ద్వారా వచ్చిన వాటిని తొలగించి ఆల్టరేషన్ చేసిన సైలెన్సర్లు బిగించి శబ్ద కాలుష్యం కలుగజేస్తున్నారని ఎస్పీ డి.నరసింహాకిషోర్ దృష్టికి వచ్చింది. దీంతో ఆయన ఆదేశాల మేరకు జిల్లా ట్రాఫిక్ పోలీసులు రెండు రోజులుగా తనిఖీలు నిర్వహించి, శబ్ద కాలుష్యం కలగజేస్తున్న సుమారు వంద బుల్లెట్ సైలెన్సర్లు తొలగించి వాహనదారులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. అటువంటి శబ్ద కాలుష్యం కలిగించే సైలెన్సర్లను వాహనదారులు తక్షణమే తొలగించాలని సూచించారు. ఇక నుంచి శబ్ద కాలుష్యం కలుగజేసే వాహనాల సైలెన్సర్లపై ప్రతిరోజు డ్రైవ్ నిర్వహిస్తామన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతి


నగదు బహుమతి అందుకున్న విద్యార్థులతో టీచర్లు

కంబాలచెరువు: స్థానిక శ్రీనివాస రామానుజం మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో శనివారం దివంగత గోందేశీ గణపతిరెడ్డి 11వ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారులు గోందేశీ హరనాథ్ రెడ్డి, కోడలు మాజీ కార్పొరేటర్ మాధవీలత పాఠశాల సెల్ఫ్ అసెస్‌మెంట్-2 పరీక్షలలో మంచి మార్కులు సాధించిన వారికి గణపతిరెడ్డి జ్ఞాపకర్థం రూ.10వేల రూపాయల బహుమతులు అందజేశారు. మాధవి, హరనాథ్ దంపతులు మాట్లాడుతూ నవంబర్ 23న, ప్రతి సంవత్సరం విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందచేస్తున్నామని, విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. బాగా చదువుకుని వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని సత్యవతి వారికి కృతజ్ఞతలు తెలిపారు.